ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY 5 జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
సోమవారం 31 మార్చి 2025

కొడుకు ఆత్మహత్యను తట్టుకోలేక

తండ్రి బలవన్మరణం

ఉగాది పర్వదినం నాడు విషాదం 6

వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామంలో ఘటన

సంబురంగా.. ఉగాది

నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో ఆదివారం ఉగాది పండుగను ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. షడ్రుచుల పచ్చడి చేసుకుని సేవించారు. భక్ష్యాలు చేసుకుని తిన్నారు. సాయంత్రం ఆలయాల వద్ద, గ్రామ రచ్చకట్టల వద్ద అర్చకులు పంచాంగం చదివి వినిపించారు. కొల్లాపూర్‌లో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్


వనపర్తిలో పంచాంగ శ్రవణంలో చిన్నారెడ్డి


కొల్లాపూర్ రామ మందిరంలో పంచాంగం వింటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


పంచాంగం వినిపిస్తున్న పురోహితులు


వనపర్తిలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


వనపర్తి పట్టణంలోని ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న యువతులు


గద్వాల భక్తమార్కండేయ ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు వెంకటేశ్


అచ్చంపేట పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో పంచాగం వినిపిస్తున్న అర్చకుడు


గద్వాల సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగం వినిపిస్తున్న బోరవెల్లి పవన్‌కుమార్


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పంచాంగం వింటున్న భక్తులు


వనపర్తిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు


ఊర్కొండపేటలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్థులు



తాగునీటి శుద్ధీకరణ కేంద్రం

తాగునీటి తిప్పలు షురూ

- అత్యధిక మునిసిపాలిటీల్లో రోజు విడిచి రోజు సరఫరా
- రక్షిత మంచినీటికి నోచుకోని ఎగువ గిరిజన తండాలు, చెంచు పెంటలు
- డెడ్ స్టోరేజీ దిశగా శ్రీశైలం జలాశయం
- ఏప్రిల్ వరకు తాగునీటిని అందించే విషయంలో అధికారుల్లో ఆందోళన

నాగర్‌కర్నూల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తాగునీటికి తిప్పలు షురూ అయ్యాయి. నీటి సరఫరా వ్యవస్థలో లోపం గ్రామీణ ప్రాంతాలల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడం, నీటి వనరులను చక్కదిద్దే వ్యవస్థ లేకపోవడంతో జనం ఇక్కట్లకు గురవుతున్నారు. మరో పక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 19 మునిసిపాలిటీలు, 4 వేల ఆవాసాలకు తాగునీరందించే మిషణ్ భగీరథ గ్రిడ్ శ్రీశైలం నుంచి నీటిని పంపింగ్ చేసే ప్రక్రియ నిలిచిపోతే వేసవిని ఎలా అధిగమించాలనే విషయంలో అధికారుల్లో ఆందోళన నెలకొన్నది.

రోజు విడిచి రోజు నీటి సరఫరా

డిమాండ్‌కు తగిన నీటి సరఫరా మిషన్ భగీరథ ద్వారా లేకపోవడంతో అనేక మునిసిపాలిటీల్లో నీటి సరఫరా రోజు విడిచి రోజు జరుగుతోంది. అసలే వేసవి నీటి వినియోగం అధికంగా ఉంటుంది. మిషన్ భగీరథపై నమ్మకంతో మునిసిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో గతంలో తాగునీటిని సరఫరా చేసిన బోర్లు, బావుల మెయింటెనెన్స్‌ను గాలికొదిలేయడంతో జనానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి

(మిగతా 6లో..)

విశేష అలంకరణలో రామలింగేశ్వర స్వామి

రెండో దక్షిణకాశీగా పేరుగాంచిన కందూరు రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఉగాది రోజు ఆదివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

\- మూసాపేట




అల్లమాయపల్లిలో పొలాన్ని చదును చేస్తున్న ఉపాధి కూలీలు

తల్లడిల్లుతున్నారు..

ఖిల్లాఘణపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో కనీస వసతులు కరువయ్యాయి. ఎండ తీవ్రత పెరగడంతో ఉక్కపోతతో ఉపాధి కూలీలు తలడిల్లిపోతున్నారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలకు ఉపాధి కూలీలకు నీడ కోసం టెంట్లు వేయాలని, తాగునీటి వసతి కల్పించాలని, ప్రథమ చికిత్స కిట్లను ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించక పోవడంతో నర్సరీలలో వేసే పరదాలు ఎక్కడో ఒకచోట వేసి నామమాత్రంగా పని ముగిస్తున్నారు. వనపర్తి జిల్లాలో ఉన్న 1,22,000 జాబ్ కార్డుల్లో 75,000 జాబ్ కార్డులు మాత్రమే పని చేస్తున్నాయి. జిల్లాలో ఉపాధి కూలీలుగా సుమారు 2,38,000 మంది నమోదైనా.. 1,21,000 మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల ఉపాధి పని పూర్తి చేసిన జాబ్ కార్డుదారులు 1,315 మాత్రమే ఉన్నారు. ఉపాధి హామీ పథకంలో నిబంధనలు కఠినతరం కావడం, వసతులు లేకపోవడంతో కూలీలు తగ్గుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఈ ఏడాది ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ.300 చెల్లించాల్సి ఉన్నా.. వారు చేస్తున్న కొలతల ప్రకారం కూలీలకు నెలవారి వేతనం రూ.212.28గా నమోదయింది. మార్చి 29న ఒక్క రోజు నమోదైన ఉపాధి కూలీల వివరాల ప్రకారం వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో 255 గ్రామాల్లో 7,249 మంది ఉపాధి కూలీలు గ్రామాల్లో వివిధ పనులు చేశారు. జిల్లాలో అత్యధికంగా ఖిల్లాఘణపురం మండలంలో 1,004 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరు కాగా పెబ్బేరు మండలంలో 305 మంది కూలీలు మాత్రమే హాజరయ్యారు. తద్వారా ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. కొత్త సాఫ్ట్‌వేర్‌తో సమ్మర్ అలవెన్స్‌లు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పని ప్రదేశాలలో కూలీలకు నీడ వసతి, తాగునీరు లేకపోవడంతో బోరు నీటిని తాగుతున్నారు. కూలీకి సౌకర్యాలు, సరిపడా డబ్బులు సకాలంలో అందకపోవడంతో జాబ్‌కార్డు దారులు పనులకు రావడానికి జంకుతున్నారు. అధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


మానవపాడులో మిర్చి వద్ద కూలీలు

ధరలు ఇలా.. సాగు ఎలా..?

- సీజన్ ప్రారంభంలో క్వింటాలు ఎండు మిర్చి ధర రూ.15 వేలు
- పంట చేతికి వచ్చే సమయంలో రూ.12 వేలు
- రైతు మార్కెట్‌కు తీసుకెళ్తే రూ.8 వేలు
- మిర్చి సాగు ముందుకు సాగేనా..?

6

నేడే రంజాన్

- కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు
- టోపీలు, అత్తరుకు పెరిగిన గిరాకీ
- రంజాన్ వేడుకల కోసం తరలి వచ్చిన ముస్లింలు
- ఈద్గాల వద్ద ముమ్మర ఏర్పాట్లు


వనపర్తి పట్టణంలోని ఈద్గా మైదానంలో ఏర్పాటు చేసిన టెంట్లు

నాగర్‌కర్నూల్/గద్వాల టౌన్/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ఉపవాస దీక్షలు నేటితో ముగియనున్నాయి. నెలవంక దర్శనంతో ముస్లింలు పండుగ ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లింలు ఇదే మాసంలో దానధర్మాలకు కూడా పెద్దపీట వేస్తారు. పండుగ కోసం సరకులు కొనేవారితో మార్కెట్ కిటకిటలాడింది. సోమవారం రంజాన్ సందర్భంగా జరిగే ప్రత్యేక ప్రార్థనలకు నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలలోని పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న ఈద్గా దగ్గర ఉదయం 9గంటలకు ఈదుల్ ఫితర్ నమాజ్ జరుగుతుంది. కొల్లాపూర్‌లోని ఖాదర్‌పాషా దర్గా వద్ద ఉన్న ఈద్గా వద్ద ఉదయం 9:30 గంటలకు నమాజ్ చేస్తారు. కల్వకుర్తిలోని కుర్మిద్ద రోడ్డులో ఉన్న ఈద్గాలో 9:45 గంటలకు, గచ్చిబావి వద్ద ఉన్న ఈద్గాలో 10గంటలకు నమాజ్ జరుగుతుంది. అచ్చంపేటలో నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న ఈద్గాలో 9గంటలకు నమాజ్ చేయాలని మత పెద్దలు నిర్ణయించారు.

గద్వాల పట్టణంలోని ఈద్గా మైదానాన్ని ఆదివారం మునిసిపల్ కార్మికులు శుభ్రం చేశారు. రాయచూరు రోడ్డు సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేసే వారికి సౌకర్యంగా ఉండేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. స్థానిక నాయకులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాల పార్కింగ్‌తో పాటు రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోని ఈద్గాను ఆదివారం ముస్తాబు చేశారు. పట్టణంలోని మహమ్మదీయ మసీదును ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుత్ దీప కాంతులలో మసీదులు వెలిగిపోతున్నాయి.


విద్యుత్ కాంతులతో ముస్తాబైన వనపర్తి పట్టణలోని మహమ్మదీయ మసీదు

మొక్కే కదా అని..

- కొరవడిన 'హరితహారం' సంరక్షణ?

- గద్వాల జిల్లాలో 9 విడతల్లో నాటిన మొక్కలు 2.87 కోట్లు
- గత ప్రభుత్వ హయాంలో 98 శాతం వరకు మొక్కలు బతికినట్లు నివేదికలు ?
- అధికారుల నివేదికలకు, క్షేత్రస్థాయిలో ఉన్న మొక్కల పెరుగుదలకు భారీ వ్యత్యాసం ?
- అయినా మొక్కల సంరక్షణ చర్యలు భేష్ అంటున్న అధికారులు !

7

ఉండవెల్లి మండలం, కలుగట్ల శివారులో కాలుతున్న హరితహారం చెట్లు..(ఫైల్)





దామరగిద్ద మండలం ఉద్మల్‌గిద్దలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



మక్తల్ మండలం పంచదేవ్‌పాడ్‌లో పామ్‌పండ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో(ఫైల్)

ఉపాధి కూలీలకు ఉపశమనం

- కూలి రూ.300 నుంచి 307కు పెంపు
- ఏప్రిల్ 1 నుంచి అమలు
- నారాయణపేట జిల్లాలో 1.10 లక్షల జాబ్‌కార్డులు
- పని కల్పిస్తున్న కుటుంబాల సంఖ్య 49,278

నారాయణపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల దినసరి కూలిని ప్రభుత్వం రూ.7 పెంచింది. ఇది వరకు రూ.300 ఇస్తుండగా, రూ.307 ఇవ్వనుంది. దాంతో కూలీలకు ఉపశమనం కలుగనుంది. పెరిగిన కూలి ఏప్రిల్ 1 నుంచి చెల్లించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు ఉండగా, 1,10,817 జాబ్‌కార్డులు ఉన్నాయి. రోజు 16,368 మంది కూలీలు పనులకు వస్తున్నారు. అంటే గ్రామానికి 58.54 శాతం మంది హాజరవుతున్నారు. వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 754 ఉన్నాయి. జిల్లాలో పని కల్పించిన కుటుంబాల సంఖ్య 49,278 ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21,33,000 మందికి పని కల్పించాల్సి ఉండగా, ఈ నెల 25 వరకు 20,33,000 మందికి పని కల్పించారు. ఏప్రిల్ 1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం 2025-26లో రూ.26 లక్షల బడ్జెట్‌తో 27.24 లక్షల పని దినాల కల్పనే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. 266 రకాల పనుల్లో తాజాగా చెరువుల పూడిక తీత పనులు తాత్కాలికంగా తొలగించి, మిగతా పనులు చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతించింది.

పెంపుదల ఇలా..

ఉపాధి హామీ పథకం ఆరంభంలో రోజుకు రూ.87.50 కూలి చెల్లించే వారు. వలసలను నియంత్రించి ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్రమ క్రమంగా కూలి పెంచుతూ వస్తోంది. 2022లో రూ.12 పెంచింది. 2023లో రూ.15 పెంచి రూ.272 ఇవ్వగా, 2024లో రూ.28 పెంచి రూ.300 ఇచ్చింది. తాజాగా రూ.7 పెంచి రూ.307 ఇవ్వనుంది.

కొడుకు ఆత్మహత్యను తట్టుకోలేక

తండ్రి బలవన్మరణం

● ఉగాది పర్వదినం నాడు విషాదం





రాములు, ఆంజనేయులు(ఫైల్)

గోపాల్‌పేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కుమారుడి మృతిని తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉగాది పండుగ రోజు జరిగిన ఈ విషాదకర సంఘటన వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఏషమోని కోదండరాములు (50) కుమారుడు ఏషమోని ఆంజనేయులు (25) నాలుగు రోజుల క్రితం మంగళవారం అర్ధరాత్రి భార్యతో గొడవపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తండ్రి కోదండరాములు మానసికంగా కుంగిపోయాడు. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడటాన్ని తట్టుకోలేకపోయాడు. తీవ్రమైన మనస్తాపంతో శనివారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబానికి పెద్దదిక్కయిన ఇద్దరు మగవారు బలవన్మరణానికి పాల్పడటంతో ఆ ఇంటికి మగ దిక్కు లేకుండా పోయింది. బాధిత కుటుంబాన్ని టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు శ్రావణ్ కుమార్ పరామర్శించారు.

బల్లి పడ్డ చట్నీ తిని నలుగురికి అస్వస్థత



అస్వస్థతకు గురైన శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్

● కేసు నమోదు చేసిన ఎస్ఐ



చట్నీలో ఉన్న బల్లి(ఇన్‌సెట్లో)

గద్వాల క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బల్లి పడిన చట్నీ తిని నలుగురు అస్వస్థతకు గురయ్యారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం ఈ సంఘటన జరిగింది. బాధితులు, పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రెవెన్యూ కాలనీకి చెందిన శ్రీనివాసరెడ్డి, రఘు, వెంకటేశ్, వర్మ అనే వ్యక్తులు ఆదివారం ఉదయం పట్టణంలోని అహ్మద్ టిఫిన్ సెంటర్‌లో టిఫిన్ కొని పార్సల్ తీసుకెళ్లారు. శ్రీనివాస్‌రెడ్డి తన ఇంట్లో టిఫిన్ చేస్తుండగా చట్నీలో బల్లి కనిపించడంతో ఒక్కసారిగా తినడం ఆపేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికే ఆయనకు వాంతులయ్యాయి. దీంతో ఆయన వెంటనే టిఫిన్ సెంటర్‌కు వద్దకు చేరుకొని వాగ్వాదానికి దిగాడు. పోలీసులకు ఫోన్లో ఫిర్యాదు చేసి, వెంటనే జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లాడు. అప్పటికే విషయం తెలియడంతో మిగిలిన ముగ్గురు కూడా ఆసుపత్రికి చేరుకున్నారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ ఆస్పత్రికి వెళ్ళి బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు అహ్మద్ టిఫిన్ సెంటర్ యజమాని అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్నీ శ్యాంపిల్స్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు పంపిస్తామని చెప్పారు.



జల్దిబిందె ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

ఆంజనేయస్వామి ఉత్సవాలు

కోయిలకొండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఆంజనేయస్వామి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జల్దిబిందె ఊరేగింపు, పల్లకీ సేవ చేపట్టారు. స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి తిప్పలు షురూ

(5వ పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లాలో 19 మునిసిపాలిటీలు ఉండగా 1, 2 మినహాయించి చాలాచోట్ల సరిపోయినంత నీటి సరఫరా జరగడం లేదని ప్రజల ఆరోపణ. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 56 వేల కుటుంబాలు నివసిస్తుండగా రెండు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా 58 ఎంఎల్‌డీ (మిలీయన్ లీటర్స్ పర్ డే)ల అవసరం కాగా 30 ఎల్ఎండీల నీరు మాత్రమే సరఫరా అవుతుండటంతో రోజు విడిచి రోజు వాటర్ సప్లయ్ జరుగుతుంది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 80 వేల జనాభా ఉండగా రోజుకు 15 ఎంఎల్‌డీలు అవసరం కాగా 12.6 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతుంది. అమృత్-2 పథకం కింద రూ. 63.25 కోట్లు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కావడానికి ఇంకా రెండేళ్ల సమయం పట్టే పరిస్థితి ఉన్నది. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా దీవిగ్రామం గుర్రంగడ్డకు మిషన్ భగీరథ నీరు అందడం లేదు. వనపర్తి జిల్లాలోని 5 మునిసిపాలిటీల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. పెబ్బేరు మునిసిపాలిటీలో 5,317 నివాస గృహాలు ఉండగా ఇక్కడ ప్రతీ రోజు 3.0 ఎంఎల్‌డీల రక్షిత మంచినీరు అవసరమవుతుంది. మిషన్ భగీరథ ద్వారా 1.7 ఎంఎల్‌డీల నీరు మాత్రమే అందుతుంది. ఆత్మకూరు మునిసిపాలిటీలో 3.0 ఎంఎల్‌డీలకు గాను 1.93 ఎంఎల్‌డీ, అమరచింతలో 2.21 ఎంఎల్‌డీలకుగాను 1.4 ఎంఎల్‌డీల రక్షిత మంచినీరు మాత్రమే సరఫరా జరుగుతుంది. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 10,954 నివాస గృహాలు ఉండగా తాగునీటి అవసరాల కోసం ప్రతీరోజు 65లక్షల 33వేల 460 లీటర్ల నీరు అవసరమవుతుంది. కానీ, ప్రస్తుతం 50 లక్షల 25వేల లీటర్ల తాగునీటి సరఫరా మాత్రమే జరుగుతుంది. కొల్లాపూర్‌లో 42 లక్షల లీటర్ల నీరు అవసరం కాగా కేవలం 29 లక్షల నీరు మాత్రమే మునిసిపాలిటీ ద్వారా సరఫరా అవుతుంది. పైపులైన్ల లీకేజీలు వాటర్‌మెన్ల నిర్లక్ష్యం వల్ల నీరు వృథాగా పోతున్నట్లు ఆరోపణలున్నాయి. అచ్చంపేట మునిసిపాలిటీలో రోజుకు 5.5 ఎంఎల్‌డీల నీరు అవసరం కాగా కేవలం 4 ఎంఎల్‌డీలు మాత్రమే సరఫరా అవుతుంది. బస్సు డిపో వెనుక ఉన్న కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితులు తప్పనిసరిగా మారనున్నాయి.

ఆందోళన కలిగిస్తున్న శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ

గతేడాది వర్షాకాలం సీజన్‌లో శ్రీశైలం జలాశయంలో సమృద్ధిగా నీరు చేరినా ఉభయ తెలుగు రాష్ట్రాలు జల విద్యుత్పాదన కోసం నీటిని పోటీపడి వినియోగించడంతో శ్రీశైలం ప్రాజెక్టులో నీటి నిల్వ రికార్డు స్థాయిలో తగ్గిపోయింది. ప్రస్తుతం 826 అడుగుల మేరకు నీరు నిల్వ ఉన్నప్పటికీ వేసవి కాలం దాటే వరకు ఇక్కడ ఇదే పరిస్థితిని మెయింటెన్ చేయకుంటే మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా డోలాయమానంలో పడనుంది. 19 మునిసిపాలిటీలు 4 వేల ఆవాసాలకు రెగ్యులర్‌గా రక్షిత మంచినీటిని సరఫరా చేయాలంటే నెలకు కనీసం 08 నుంచి 09 టీఎంసీల వరకు నీరు అవసరమవుతాయి. అంటే దాదాపు సంవత్సరానికి 10 టీఎంసీల నీరు మిషన్ భగీరథకు కావాలి. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ 800 అడుగులకు పడిపోతే ఈ వ్యవస్థ అంతా నిర్వీర్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయో వేచి చూడాల్సి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, బిజినేపల్లి మండలాల్లో ఎగువ ప్రాంతాల్లో ఉన్న గిరిజన తాండాలు, చెంచు పెంటలున్నాయి. అనేక కారణాల దృష్ట్యా అక్కడ మిషన్ భగీరథ వ్యవస్థనే ఏర్పడలేదు. ఎండల ప్రతాపం ఇలాగే ఉంటే ముున్ముందు వారి పరిస్థితి ఎలా ఉండబోతుందనే అంశంలో ఆందోళన నెలకొన్నది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

పెబ్బేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల దగ్గర 44వ జాతీయ రహదారిపై ఆదివారం మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ (40) మృతి చెందిందన్నారు. విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి సిబ్బందిని పంపించి మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మహిళ మతిస్థిమితం లేక రోడ్డు వెంట తిరుగుతుందా లేక ఇంకేమైనా కారణాల అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరికైనా విషయం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ముస్లిం మత పెద్దలకు సన్మానం

మన్ననూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ ఉపవాస దీక్షల ముగింపు సందర్భంగా ముస్లిం మత గురువులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సన్మానం చేశారు. రంజాన్ మాసం మొత్తం ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తున్న క్రమంలో వారికి తోడ్పాటునందిస్తూ మసీదులో ఉదయం, సాయంత్ర వేళల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేలా సేవలందించినందుకు మత గురువులను ప్రత్యేకంగా అభినందించారు. రంజాన్ పర్వదినం సోమవారం కావడంతో మత గురువులందరికీ షాలువాలు కప్పి తోఫా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంత్ డీసీసీ కార్యదర్శి సంభు వెంకట్‌రమణ, కాంగ్రెస్ నాయకులు రహీం, పంబలి బుచ్చయ్య, జూలూరి సత్యనారాయణ, రహిమాన్, శివాజీ, రాజారాం, వెంకటయ్య, శంకరయ్య, బాబ పాల్గొన్నారు.

ఆలయంలో బంగారు

మంగళసూత్రం వితరణ



పాలెం వెంకన్న ఆలయంలో అర్చకుడు జయంత్‌కు మంగళసూత్రం ఇతర ఆభరణాలు అందిస్తున్న దాతలు

బిజినేపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలోని అలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని శివాలయంలోని అమ్మవారికి ముడుపుగా రూ.68 వేల విలువైన బంగారు మంగళసూత్రం, వెండి మెట్టెలు, వెంకన్న స్వామికి వెండి తీర్థ ఉద్ధరిణి పాత్రను వడ్ల అనంతచారి జ్ఞాపకార్థం ఆయన భార్య శ్రీదేవి, కుమారులు వడ్ల హేమాద్రి శ్రీకర్, వడ్ల వేదాద్రి శ్రీపాదలు ఆదివారం ఆలయ అర్చకులు కురవి జయంత్, చక్రపాణిలకు వితరణ చేశారు. దాతలు అందజేసిన ఆభరణాలను అర్చకులు ప్రత్యేక పూజలు చేసి దేవతామూర్తులకు అలంకరించి వారి కుటుంబానికి స్వామి, అమ్మవార్ల కృపా కటాక్షాలు ఉండాలని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ధరలు ఇలా.. సాగు ఎలా..?

- మిర్చి సాగు ముందుకు సాగేనా..?



మానవపాడులో కుప్పగా పోసిన ఎండుమిర్చి(ఫైల్)

మానవపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ధర లేకపోవడంతో రైతులు డీలాపడుతున్నారు. ప్రతీ ఏడాది పంట చేతికొచ్చే సరికి ధరలు పడిపోడం ఎంటని, మూడు సంవత్సరాల క్రితం క్వింటాలు మిర్చి ధర రూ. 24 వేలు ఉన్న గుంటూరు రకం ప్రస్తుతం రూ.8 వేలు ధర పలకడం వెనుక కారణం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏడాది రైతుకు మాత్రం ఎరువుల బస్తాలు, పురుగు మందులు, కూలీల ధరలు పెరుగుతున్నా రైతు పండించిన పంటకు మాత్రం ఏడాదికి ఏడాదికి ధరలు తగ్గుతున్నాయి. ఎండు మిర్చి ధర పూర్తిగా పడిపోవడంతో రైతులు అమ్ముకోలేక గిడ్డంగులను ఆశ్రయిస్తున్నారు. అంతే కాకుండా ధరలు ఇలా పడిపోతే మిర్చి సాగు చేయాలా వద్దా అని రైతులు అయోమయంలో ఉన్నారు.

రైతు కష్టాన్ని ఆలోచించాలి..



ప్రతీ ఏడాది మిర్చి పంట నష్టం వస్తున్నా వ్యవసాయం మానుకోలేక అప్పులు చేసి పంట సాగుచేస్తున్నాం. తాము పంట సాగుచేసే సమయంలో ఉన్న ధర.. మిర్చిని మార్కెట్‌కు తీసుకువెళ్లే సమయానికి పూర్తిగా వ్యత్యాసం ఉంటుంది. ఏడాదికి ఏడాది ప్రతీ వస్తువుపై ధరలు పెరుగుతున్నా రైతులు పండించిన పంటలకు మాత్రం ధరలు పెరగడంలేదు. రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ధరలు నిర్ణయించాలి.

- చాందు, మానవపాడు

తాలు మిర్చికంటే అన్యాయం



రెండు సంవత్సరాల క్రితం తాలు మిర్చికి పలికిన ధర ఈ ఏడాది నాణ్యమైన మిర్చికి రావడం లేదు. ప్రతీ ఎకరాకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేసి పంటలు పండిస్తున్నాం. చివరికి పంట వచ్చిన తరువాత ధర నిర్ణయం దళారుల చేతుల్లోకి పోతోంది. దీంతో తక్కువ ధరకు విక్రయించలేక గిడ్డంగులకు వెళ్లి పంటను కాపాడుకుంటున్నాం.

- మహేశ్, మానవపాడు

కూలీల ఖర్చు అధికం



ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చి పంటలకు ఉన్న ధరలతో రైతుకు పెట్టుబడి కూడా రావడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందు ఖర్చులు ఒక ఎత్తైతే కూలీల ఖర్చులు చాలా అవుతున్నాయి. ఏపీ, కర్ణాటక ఇతర ప్రాంతాల కూలీలను తీసుకువస్తున్నాం. ఉన్నతాధికారులు స్పందించి తగిన ధర కల్పించి మిర్చి రైతులను ఆదుకోవాలి.

- మద్దిలేటి, మానవపాడు

ఘనంగా ఎద్దుల బండ్ల గిరక పోటీలు

ఆత్మకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగ పురస్కరించుకుని ఆత్మకూరు మండల పరిధిలోని పిన్నంచర్లలో ఎద్దుల బండ్ల గిరక పోటీలను మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మశ్చిందర్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరక పోటీల్లో 14 జతల కాడెద్దులు పాల్గొనగా బోయ చిన్న గోవిందు మొదటి బహుమతి, గొల్ల రాజు రెండో బహుమతి, మదర్ శ్రీకాంత్ మూడో బహుమతి సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2వేలతో పాటు షీల్డులను అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలుగు పండుగ విశిష్టతను వివరించేలా ప్రతీ ఏడాది ఎద్దుల బండ్ల పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివశంకర్, శివానంద రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాములు, మాసన్న, తిరుపతయ్య, కాజన్న, విష్ణు, అశోక్, సుధాకర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎద్దుల బండ్ల గిరక పోటీల్లో బండి లాగుతున్న వృషభరాజులు

గురుకుల ప్రవేశ పరీక్షల్లో

రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకు



ఆకాష్, విద్యార్థి

పెబ్బేరు రూరల్/ఆత్మకూరు, మార్చి 30 (ఆధ్రజ్యోతి): గురుకుల పరీక్ష ఫలితాల్లో పెబ్బేరు మండలం శాఖపురం గ్రామంలోని ప్రగతి విద్యాలయంలో నాలుగవ తరగతి చదువుతున్న ఆకాష్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ భీమ్‌సాగర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో సాధించిన గురుకుల ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులే 12 స్థానాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ-నాగేంద్ర దంపతుల కుమారుడు ఆకాష్ రాష్ట్ర స్థాయిల్లో మొదటి ర్యాంకు సాధిండంతో పాఠశాలకు మంచి పేరు తీసుకు వచ్చాడన్నారు.

● ఆత్మకూరు మండలం మోట్లంపల్లి పాఠశాల విద్యార్థి కుమార్ రాష్ట్రవ్యాప్తంగా 319 వ ర్యాంకు సాధించినట్లు లిటిల్ ఫ్లవర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తర్ బేగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ర్యాంకు సాధించిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు వీరన్న, విజయ్, శాంతన్న, రాఘవేందర్ అభినందించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



రాంపురంలో రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్, మార్చి 30 (ఆధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర ప్రణాళికా ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రాంపురం గ్రామంలో రూ.5 లక్షలతో చేపడుతున్న మట్టి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గ్రామాల అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు రాములుయాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

జోగుళాంబ దేవికి బంగారు కిరీటం

బహూకరించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల బృందం



జోగుళాంబ ఆలయంలో కిరీటాన్ని బహూకరిస్తున్న దాతలు

అలంపూరు మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అలంపూరు జోగుళాంబ అమ్మవారికి హైదరాబాదు, బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల బృందం ఆదివారం బంగారు కిరీటాన్ని బహూకరించారు. సుమారు రూ.1.60కోట్ల విలువ ఉంటుందని ఈవో పురేందర్ కుమార్ తెలిపారు. దాతలకు ఆలయ ఛైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్ కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం శేష వస్త్రాలతో సత్కరించారు.

రెండు ఇసుక టిప్పర్లు సీజ్

కల్వకుర్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు మినీ ఇసుక టిప్పర్లను సీజ్ చేసినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. వంగూరు మండలం డిండి చింతపల్లి నుంచి అక్రమంగా రెండు మినీ టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా కల్వకుర్తి సమీపంలోని కుర్మిద్ద బైపాస్ రోడ్డు వద్ద గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేసి డ్రైవర్లు సురేష్, సుదర్శన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మాధవరెడ్డి హెచ్చరించారు.

పాలమూరు ఆణిముత్యాలు

» గ్రూప్-1లో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురికి మెరుగైన ర్యాంకులు

గ్రూప్-1 ర్యాంకులను ఆదివారం ప్రభుత్వం విడుదల చేయగా, ఉమ్మడి పాలమూరు జిల్లాలో నలుగురు మెరుగైన ర్యాంకులు సాధించారు. అందులో కొత్తకోట మండలం, వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్ కుమార్ 25వ ర్యాంక్ సాధించారు. అలాగే, మూసాపేట మండలం, నిజాలాపూర్ గ్రామానికి చెందిన వెంకటేష్‌ప్రసాద్ సాగర్ 27వ ర్యాంకుతో ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ భరోసా కేంద్రంలో ఎస్సైగా పనిచేస్తున్న సుజాత గ్రూప్-1 మెయిన్స్‌లో 405 ర్యాంక్ సాధించారు. కల్వకుర్తికి చెందిన ఎం.సాహితీ గ్రూప్-1లో మల్టీజోన్-2లో 45వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 119వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటారు.



మండ్ల పవన్ కుమార్

కొత్తకోట/మూసాపేట/మహబూబ్‌నగర్/కల్వకుర్తి టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలం, వడ్డెవాట గ్రామానికి చెందిన మండ్ల పవన్ కుమార్ గ్రూప్-1లో 25వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్ వన్ రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. ఈ నెల 11వ తేదీన గ్రూప్-1 మార్కుల జాబితా విడుదల చేయగా, పవన్ కుమార్‌కు 510 వచ్చాయి. రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంక్ (బీసీ ఏలో 2వ ర్యాంక్) రావడంతో ఆర్డీవో లేదా డీఎస్పీ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని బంధు మిత్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పలు విషయాలు తెలియజేశారు. సివిల్స్‌లో ఐఏఎస్ సాధించి ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రూప్ వన్‌లో వచ్చిన 25వ ర్యాంక్ సివిల్స్ సాధించడానికి ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు.



వెంకటేష్ ప్రసాద్

● తల్లిదండ్రులు వెన్నంటి ప్రోత్సహించడం వల్లే తాను గ్రూపు-1 లో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు సాధించానని ఎం.వెంకటేష్ ప్రసాద్‌సాగర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, మూసాపేట మండలం, నిజాలాపూర్ గ్రామానికి చెందిన ఎం.సత్తయ్య, యశోద దంపతుల కుమారుడు ఎం.వెంకటేష్ ప్రసాద్ సాగర్ హైదరాబాద్, పటాన్ చెరువులోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో 1 నుంచి 2వ తరగతులు, కొత్తకోటలోని జీటీ నారాయణ స్కూల్‌లో 3వ తరగతి, మహబూబ్‌నగర్‌లోని చైతన్య సెంట్రల్ స్కూల్‌లో 4 నుంచి 10 వ తరగతి వరకు చదువుకున్నాడు. అనంతపూర్ జిల్లా, పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, డిగ్రీ బీఎస్సీ ఫిజిక్స్ పూర్తి చేశాడు. పీజీ కూడా అక్కడే పూర్తి చేశాడు. గతంలో గ్రూపు-1 పరీక్ష రాయగా 300 ర్యాంకు వచ్చింది. తాజాగా రెండోసారి రాయగా రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, మల్టీజోనల్ లెవల్‌లో 12వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ ఫలితాలు రాలేదని, హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో డీఎస్పీ, జేసీ కావాలన్న తన లక్ష్యమని ఎం.వెంకటేష్ ప్రసాద్ సాగర్ అన్నారు. అతడి తండ్రి ఎం.సత్తయ్య విద్యుత్ శాఖ కోయిలకొండలో ఏఈగా పనిచేస్తున్నారు.



ఎస్సై సుజాత

● గ్రూప్-1లో మహబూబ్‌నగర్ భరోసా కేంద్రంలో ఎస్సైగా పనిచేస్తున్న సుజాత ప్రతిభ చాటారు. ఆది వారం గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల కాగా ఇందులో ఎస్సై సుజాత 459 మార్కులతో 405 ర్యాంక్ సాధించారు. కేటగిరి గ్రూప్ ఏ కావడంతో ఆమెకు డీఎస్పీగా అవకాశం లభించనుంది. 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికైన సుజాత తరువాత 2022లో ఎస్సైగా ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ టు టౌన్ ఎస్సైగా, అనంతరం మూసాపేట ఎస్సైగా పనిచేశారు. అదే సమయంలో గ్రూప్ 1కు నోటిఫికేషన్ విడుదల కావడంతో సిక్ చేసి గ్రూప్ 1కు ప్రిపేర్ అయ్యారు. ప్రస్తుతం భరోసా కేంద్రం ఎస్సైగా పనిచేస్తున్న సుజాత గ్రూప్ 1 ర్యాంక్‌తో డీఎస్పీ అయ్యే అవకాశాలున్నాయి.



సాహితి

● కల్వకుర్తి పట్టణానికి చెందిన ఎం.సాహితి టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1లో మల్టీజోన్-2లో 45వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 119వ ర్యాంకు సాధించింది. సాహితి తల్లిదండ్రులు వెంకటరమణ, రాజ్యలత ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఆమె ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువు తుంది. సాహితీకి గ్రూప్-1 ర్యాంకు రావడంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు డీసీఎంను ఢీకొట్టిన కారు

- ఇద్దరికీ తీవ్ర గాయాలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆఫీస్ సమీపంలో చోటు చేసుకున్న ఘటన



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన గౌతంపల్లి మాజీ సర్పంచ్

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న డీసీఎంను వెనకాల నుంచి కారు ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరి కి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ ఆఫీస్ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాల ప్రకారం.. తెలకపల్లి మండలం గౌతంపల్లి మాజీ సర్పంచ్ యాదిరెడ్డి తన కుమారుడితో కలిసి కారులో గౌతంపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తుండగా ఎస్పీ ఆఫీస్ సమీపంలో డీసీఎంను వెనక నుంచి ఢీ కొట్టారు. ఈ సంఘటనలో కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో పెద్దప్రమాదం తప్పింది. యాదిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా అతని కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురికి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ తరలించినట్లు స్థానికు తెలిపారు. ఈ సంఘటనపై నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఇసుకను తరలిస్తే అడ్డుకుంటాం



వాగు వద్దకు వెళ్లిన జాజాల నాయకులు, రైతులు

వంగూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని జాజాల వద్ద వాగు నుంచి ఇసుకను తరలించేందుకు యంత్రాలతో రోడ్డు వేస్తున్నారు.. ఇందుకు ఇసుకను తరలిస్తే అడ్డుకొని తీరుతామని జాజాల గ్రామ రైతులు, నాయకులు హెచ్చరించారు.

ఆదివారం మండలంలోని జాజాల గ్రామ శివారులో గల దుందుభీ వాగులో ఇసుకను తీసేందుకు గుర్తించిన క్వారీని పరిశీలించారు. వాగులో ఇసుకను తీసేందుకు అక్కడికి ఇటాచ్‌లు, టిప్పర్లు వచ్చి ఉండటంతో రైతులు ఆందోళన చెందారు. వాగు నుంచి టిప్పర్లలో ఇసుక భారీగా తరలిపోయే అవకాశం ఉందని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి వ్యవసాయ బోరు బావులు నీరు లేక ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి ఇసుక అనుమతులను రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు.



మొక్కే కదా అని..

● కొరవడిన 'హరితహారం' సంరక్షణ?

» గద్వాల జిల్లాలో 9 విడతల్లో నాటిన మొక్కలు 2.87 కోట్లు
» గత ప్రభుత్వ హయాంలో 98 శాతం వరకు మొక్కలు బతికినట్లు నివేదికలు
» అధికారుల నివేదికలకు, క్షేత్ర స్థాయిలో ఉన్న మొక్కల పెరుగుదలకు భారీ వ్యత్యాసం!
» అయినా మొక్కల సంరక్షణ చర్యలు భేష్ అంటున్న అధికారులు

అయిజ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కల పెంపకం చేపట్టినప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల నేడు అవి కొన్ని చోట్ల కాలుతూ... ఎండుతూ ఉన్నాయి. 2015 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా "హరితహారం" అనే కార్యక్రమాన్ని ప్రారంభించి విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వం పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రతీ ఏడాది అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకుంది. అందుకు అనుగుణంగానే ప్రతీ గ్రామపంచాయతీలో ఒక నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచేందుకు చర్యలు తీసుకుంది. 2024 సంవత్సరం వరకు 9 విడతలుగా హరితహారం కార్యక్రమం కింద గద్వాల జిల్లాలో 2.87 కోట్ల మొక్కలు నాటినట్లు రికార్డులు చెబుతున్నాయి. అంతే కాకుండా పథకం ప్రారంభం నుంచి 8 విడతలుగా నాటిన మొక్కల్లో సరాసరి 54 నుంచి 98 శాతం మొక్కలు బతికినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవ పరిస్థితులు చూస్తే మాత్రం అందుకు భిన్నంగా ఉన్నట్లుగా క్షేత్రస్థాయిలో పరిస్థితినిబట్టి తెలుస్తుంది.

అసలు కంటే కొసరే మిగిలింది!

తొమ్మిది విడతల్లో అధికారులు గ్రామపంచాయతీల ద్వారా ప్రతీ గ్రామంలో నాటిన మొక్కలు సరాసరి 3 కోట్ల వరకు ఉన్నప్పటికీ బతికిన వాటిలో మిగిలినవి 40 శాతం మేరనే ఉండొచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఏదో ప్రతీ ఏటా మొక్కల కొనుగోలుకు రూ. లక్షల్లో నిధులు ఖర్చు చేసి, తీరా కొన్నింటిని నాటి, మరికొన్నింటిని అలానే వదిలేసిన సందర్భాలు కూడా అనేకం. నాటిన మొక్కల్లో చనిపోయినవి, రైతులు తొలగించినవి, ఎండాకాలంలో అగ్నికి ఆహుతి అయినవి అన్నీ లెక్కలోకి తీసుకుంటే నాటిన మొక్కల్లో అసలు కంటే కొసరే మిగిలినట్లుగా స్పష్టమవుతున్నది. నాటి ప్రభుత్వం కూడా పథకాన్ని ప్రారంభించి నాటిన ప్రతిమొక్క బతికేలా పకడ్బందీ ప్రణాళికలు ఏర్పాటు చేయలేదనే వాదనకూడా ఉంది.

2015 నుంచి హరితహారం ఇలా...

2015-16 ఆర్థిక సంవత్సరంలో గద్వాల జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామపంచాయతీల్లో 58.63 లక్షల మొక్కలు నాటారు. 2016-17లో రూ. 69.70 లక్షలు, 2017-18లో రూ. 86.68 లక్షలు, 2018-19లో రూ.10.63 లక్షలు, 2019-20లో రూ.10.08 లక్షలు, 2020-21లో రూ.16.62 లక్షలు, 2021-22లో రూ.10.62 లక్షలు, 2022-23లో రూ.13.05 లక్షలు, 2023-24లో రూ.11.42 లక్షలు మొక్కలు నాటారు. ఈ విధంగా నాటిన మొక్కల్లో మొదటి ఏడాది 54.61 శాతం బతికినట్లు రికార్డుల్లో చూసిన అధికారులు 8వ విడతలో నాటిన మొక్కల్లో అయితే 98.28 శాతం బతికినట్లు వివరించారు.



అయిజ మండలం, పులికల్ గ్రామానికి చెందిన హరితహారం నర్సరీలో ఎండిన మొక్కలు

నాటిన మొక్కల్లో రకాలు..

గతంలో ప్రతి ఏడాది గ్రామపంచాయతీల్లో నాటిన మొక్కల్లో ప్రధానంగా దానిమ్మ, నిమ్మ, ఖర్జూర, అల్లనేరేడు, టేకు, గుల్‌మోర్, వేప, కానుగ, రేయిన్‌ట్రీ, రనపాల, చింత, నెమలి, నారా, బాహుణ్య, తులసి, గోరింట, తబూబియా, కరివేపాకు, ముద్దమందారం, టికోమో, గన్నేరు మొదలగు మొక్కలు నాటారు. 7వ, 8వ, 9వ, విడతల్లో జిల్లాలోని ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంచాయితీ సిబ్బంది పంపిణీ చేశారు.

మా గ్రామంలో విరివిగా పెంచాం

హరితహారం కార్యక్రమం ద్వారా మా గ్రామంలో మొక్కలను విరివిగా పెంచాం. కర్నూలు, నంద్యాల, కడప లాంటి పట్టణాలకు వెళ్లి వివిధ రకాల మొక్కలను కొనుగోలు చేసి తీసుకు వచ్చాం. ప్రధానంగా మా పంచాయతీలో అయితే ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయటంతో పాటూ, ప్రధాన రోడ్డు మార్గాలకు ఇరువైపులా, ప్రభుత్వ స్థలాల్లో, బీడు భూముల్లో, రైతుల పొలం గెట్ల వెంబడి వివిధ రకాల మొక్కలను నాటించాం. మా ఊరిలో కర్నూలు, రాయచూరు రోడ్డుకు ఇరువైపులా ఇప్పుడు కూడా పచ్చని చెట్లు ఉన్నాయి.

- ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచు, కలుకుంట్ల





అలంపూర్ చౌరస్తా నుంచి రాయచూరు రోడ్డుకు ఇరువైపులా కాలిపోయిన మొక్కలు



నర్సరీల బాధ్యత కార్యదర్శులదే

జోగుళాంబ గద్వాల జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న నర్సరీల బాధ్యత ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అప్పగించాం. ఎండాకాలం ముంచుకొస్తున్న తరుణంలో నర్సరీల్లోని మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకోవటంతో పాటూ రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను కూడా రక్షించాలని ఆదేశాలు ఇచ్చాం. నీటి ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుని చెట్లకు పోయాలని సూచించటం జరిగింది. గ్రామాల్లో మా సిబ్బంది తీసుకుంటున్న మొక్కల సంరక్షణ చర్యలు బేషుగ్గా ఉన్నాయి.

- నాగేంద్రం, ఇన్‌చార్జి డీపీవో, (గద్వాల జిల్లా).

అలంపూర్ చౌరస్తా నుంచి రాయచూరు రోడ్డుకు ఇరువైపులా కాలిపోయిన



ఆరు నుంచే ప్యాంట్లు

» ఈ సారి 6, 7 తరగతుల బాలురకు పంపిణీ
» జిల్లాలో ఆరో తరగతి బాలురు 2606, ఏడో తరగతి బాలురు 2606



ఊట్కూర్ ఎంఆర్‌సీకి వచ్చిన స్కూల్ యూనిఫాం క్లాత్‌ను పరిశీలిస్తున్న సీఎంవో రాజేంద్ర కుమార్

నారాయణపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): 2025-26 నూతన ఆర్థిక విద్యాసంవత్సరం ఆరంభమయ్యే నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు సకాలంలో అందించేందుకు గాను విద్యాశాఖ ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే స్కూల్ యూనిఫామ్స్ కుట్టేందుకు కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో గోవిందురాజులు, జిల్లా ఇన్‌చార్జి అధికారి రాజ్‌కుమార్‌లు జిల్లాలోని ఎంఈవోలు సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు క్లాత్‌లను జిల్లాలోని స్వయంసహాయక మహిళా సంఘాలకు కుట్టేందుకు అప్పగించాలని, పలు సూచనలు సైతం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఆరు, ఏడు తరగతి చదువుతున్న బాలురకు నిక్కర్లు చెడ్డి(లాగు)లు ఇదివరకు ఇస్తూ వచ్చింది. దాంతో ప్రాథమికోన్నత స్థాయిలో ఆరు, ఏడు తరగతి బాలురు నిక్కర్లతో తరగతి గదుల్లో ఎదురౌతున్న ఇబ్బందులు ఎదురౌతున్నాయని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ప్రభుత్వ అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చింది. వాస్తవంగా తరగతి గదుల్లో బాలురు నిక్కర్లతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఎట్టకేలకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఆరోతరగతి నుంచి బాలురకు ప్యాంట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జిల్లాలోని విద్యాశాఖ అధికారులకు అందాయి. దాంతో బాలురకు ప్యాంట్లు అందనున్నాయి. జిల్లా వ్యాప్తంగా యూనిఫామ్ పొందే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 55,278 మంది ఉన్నారు. అయితే ఇందులో ఆరో తరగతి చదివే బాలురు 2,606 మంది, ఏడో తరగతి చదివే బాలురు 2,606 మంది ఉన్నారు.

విద్యార్థులకు ప్యాంట్లు



ఈసారి ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఆరు,ఏడు తరగతి బాలురకు ప్యాంట్లు ఇవ్వాలని నిర్ణయించింది. దాంతో అందుకు అనుగుణంగా జిల్లాలో ఆరు, ఏడు తరగతి చదివే బాలురకు విధిగా ప్యాంట్లు అందించేలా చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ పాఠశాలల పునఃప్రారంభం రోజే స్కూల్ యూనిఫామ్స్ అందేలా చర్యలు తీసుకుంటాం. జిల్లాకు ఇప్పటికే వచ్చిన క్లాత్‌ను ఎంఈవోలు హెచ్‌ఎంలకు ఇచ్చి వారు కుట్టేందుకు మహిళా సంఘాలకు క్లాత్ ఇచ్చారు. కుట్టు పనులు మే 31 వరకు పూర్తి చేసి యూనిఫాం అందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఈవో గోవిందురాజుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

- రాజేంద్రకుమార్, జిల్లా యూనిఫామ్స్ ఇన్‌చార్జి అధికారి, నారాయణపేట

వైభవంగా..

పాలమూరు ఉగాది ఉత్సవాలు

» అలరించిన నృత్య ప్రదర్శనలు
» అంబేడ్కర్ కళాభవనంలో అలరించిన కవి సమ్మేళనం, ఆట పాటలు
» తెలుగుదనం ఉట్టిపడేలా వేషధారణ



బాద్మి శివకుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి, 30 (ఆంధ్రజ్యోతి): సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన శ్రీ విశ్వావసు నామ తెలుగు ఉగాది ఉత్సావాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. జానపదాలు, కోలాటాలు, సినీపాటలు, బతుకమ్మలతో ప్రారంభమైన ఉత్సవాలు కవిసమ్మేళనం, శాస్త్రీయ నృత్యం, సంగీత ప్రదర్శనలతో ముగిసింది.

ఉత్సవాలకు వచ్చిన కవులు, కళాకారులు తెలుగుధనం ఉట్టిపడేలా వేషధారణ ధరించడంతో అంబేడ్కర్ కళాభవనం నూతన శోభను సంతరించుకుంది. ఉత్సవ వేదిక అధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ అంతరించిపోతున్న గ్రామీణ కళలను, కళాకారులను ప్రోత్సహించే క్రమంలోనే సుద్దాల హనుమంతు సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పాలమూరు ఉగాది ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. కవి సమ్మేళనంతో పాటు, ఇతర కళలను కూడా ప్రదర్శించడం జరిగిందన్నారు. ఉత్సవాలకు వచ్చిన వారందరికి ఉగాది పచ్చడితో పాటు భక్షాలను అందించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన కళాకారులను, కవులను ఘనంగా సత్కరించారు. ఈ ఉత్సవాలకు హాజరైన తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్‌ను జ్ఞాపికతో సత్కరించారు. వేదిక ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ప్రచార కార్యదర్శి ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ప్రశంసా పత్రాలతో విద్యార్థినులు

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ధరూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి వల చుట్టుకుని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జోగుళాంబ గద్వాల ధరూర్ మండల పరిధిలోని రేవులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి గ్రామానికి చెందిన తెలుగు రాముడు(40) వృత్తిరీత్యా చేపలు పట్టేవాడు. యథావిధిగా ఉగాది పండుగ ఆదివారం ఉదయం జూరాల బ్యాక్‌వాటర్ వద్ద చేపల వేటకు వెళ్లాడు. కాగా, చేపలు పడుతున్న సమయంలో వల మెడకు చుట్టుకుని నీటిలో మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులతో పాటు పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని వెలికి తీశారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి అన్న హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

విద్యుత్ సమస్యలను అధిగమిస్తాం

● అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ, ధరూరు



ధరూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సమస్యలను అధిగమించి నిరంతరం విద్యుత్ సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మండల ఏఈ అనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఉచిత కరెంటు కొనసాగుతున్నదా?

మండలంలో 200 యూనిట్ల లోపల విద్యుత్ మీటర్ రీడింగ్ ఉన్న వారికి ఉచిత కరెంటు వర్తిస్తుంది. ఇప్పటికే సుమారు 60శాతం 200యూనిట్లలోపు ఉన్న లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందుతున్నది. .

24గంటలు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నారా?

మండలంలో 29గ్రామ పంచాయతీలకుగాను ఐదు సబ్‌స్టేషన్ల ద్వారా ఇటు రైతులకు, అటు గృహాలకు 24గంటలు విద్యుత్ సరఫరా కొనసాగుతున్నది. అక్కడక్కడ సమస్యలు తలెత్తితే, సిబ్బంది వెళ్లి పరిష్కరిస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

నిబంధనల ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతీ సంవత్సరానికి ఒకసారి మరమ్మతులు చేస్తున్నాం. వాటికి సంబంధించి బ్రేక్‌డౌన్‌లతో పాటు ఆయిల్ మార్పిడి తదితర వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేయించి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

విద్యుత్ సిబ్బంది కొరత ఉందా?

ప్రస్తుతం మండలంలో ఉన్న ఐదు సబ్‌స్టేషన్లలో కొంత సిబ్బంది కొరత ఉంది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశాం.

న్యూస్ బాక్స్

నేడు పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గద్వాల అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 31న సోమవారం గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం యధావిధిగా పనిచేస్తుందని, సబ్ రిజిస్ట్రార్ ముబాషీర్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ సాధారణ సెలవు ఉన్నప్పటికీ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం 25శాతం రిజిస్ట్రేషన్ ఫీజులో రాయితీ కల్పించిన చివరి రోజు ఇదే కావడంతో కార్యాలయం యధావిధిగా పనిచేస్తుందని తెలిపారు.

అదుపు తప్పితే అంతే సంగతులు



ఇటిక్యాల- శివనంపల్లి రోడ్డుపై పరిమితికి మించిన లోడ్‌తో వెళ్తున్న ఆటో

ఇటిక్యాల మార్చి 30(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పితే అంతే సంగతులు అయినా బ్రతుకు దెరువుకు అవస్థలు పడాల్సిందే. ఇటిక్యాల నుంచి శివనంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కిలోమీటరు వరకు బీటీ రోడ్డు లేని కారణంగా మొకాటి లోతు గుంతలుపడగా నిత్యం వందలాది వహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నా రోడ్డు దుస్థితి గురించి పట్టించుకునే వారు లేరని ఆయాగ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోందని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకునే వారులేరని తెలిపారు. పది సంవత్సరాల క్రితం ఇటిక్యాల నుంచి అనంతపురం గ్రామం వరకు బీటీరోడ్డు మంజూరు కాగా అంచనాలు పెరిగిపోవడంతో కిలోమీటరు రోడ్డు వదిలేశారు. అప్పటినుంచి నిత్యం నరకం చూస్తున్నామని, వాహనాలు సైతం పాడైపోతున్నాయని పలువురు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు పరిస్థితిని గుర్తించి బీటీరోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కాషాయ పతాక ఆవిష్కరణ



పతాక ఆవిష్కరణకు హాజరైన నాయకులు

గద్వాల సర్కిల్ మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం గద్వాలలోని రాజీవ్‌మార్గ్‌లో కాషాయ పతాకావిష్కరణ చేశారు. ఈసందర్భంగా వక్తలు ఉగాది విశిష్టతను వివరించారు. జిల్లా బాధ్యులు ఆనంద్, ఈశ్వరయ్య, నగర బాధ్యులు శ్రీకాంత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

విశ్వావసుకు ఘన స్వాగతం

- జిల్లా వ్యాప్తంగా ఇంటింటా ఉగాది వేడుకలు
- షడ్రుచుల పచ్చడి, భక్ష్యాల ఆరగింపు
- మామిడి తోరణాలతో ఇంటి గుమ్మాల అలంకరణ
- సాయంత్రం ఆలయాల వద్ద పంచాంగ పఠనం చేసిన పురోహితులు
- పలుచోట్ల హాలం పట్టి పొలం దున్నిన రైతులు



అయిజలో పంచాంగ శ్రవణానికి హాజరైన గ్రామస్థులు

అలంపూరుచౌరస్తా, మార్చి30 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన విశ్వావసు నామ సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. షడ్రుచుల ఉగాది పచ్చడి, భక్ష్యాలను ఆరగించారు. ఆలయాల్లో పూజలుచేశారు. రైతులు బసవన్నలకు కాడి కట్టి గ్రామ దేవతల ఆలయాల ముందు పూజలు చేశారు. వాటికి భక్ష్యాలు తినిపించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సీతారామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సంపత్‌రెడ్డి, పుల్లారెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాజరెడ్డి, భీమయ్య ఉన్నారు.

● మానవపాడు : మండలంలోని గ్రామాల్లో ఆదివారం విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉత్సవాలు జరిపారు. తెలుగు సంవత్సరం మొదటి రోజు కావడంతో తెల్లవారుజామున నుంచి కాడెద్దులతో రైతులు పంట పొలాలకు వెళ్లి భూమాతకు పూజలు చేసి దుక్కులు ప్రారంభించారు. మహిళలు ఇళ్లల్లో పచ్చళ్లు, నైవేద్య ప్రసాదాలతో దేవుళ్లకు పూజలు చేశారు. గ్రామంలోని ఆలయాల్లో రైతు సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించి వేదపండితులతో ఏడాది రైతులకు పంటల, ప్రకృతి వైపరీత్యంపై పంచాంగం చూశారు. కార్యక్రమాల్లో రైతు సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● గద్వాల సర్కిల్: ఉగాది పర్వదిన వేడుకలను గద్వాల శివారు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. విశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా పురోహితులు పంచాంగ పఠనం నిర్వహించారు.

● ఇటిక్యాల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానంగా రైతులు ఈసారి పంటలు బాగా పండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకున్నారు. ఉదయాన్నే ఎద్దులను ముస్తాబు చేసి పొలాలకు వెళ్లి పూజలు చేసి వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. అలాగే మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకులు రవిద్రాసింహాచార్యులు ప్రత్యేక పంచాగ శ్రవణాన్ని వినిపించారు. షడ్రుచుల లాగే జీవితంలో అన్నిరకాల కష్టాలు సుఖాలు వుంటాయని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని మనోధైర్యంతో జీవించాలని అర్చకులు తెలిపారు. అలాగే మండలంలో చాగాపురం, వావిలాల, తదితర గ్రామాల్లో రైతులు ప్రత్యేక కార్యక్రమాలు జరుపుకున్నారు.

● అయిజ : తెలుగు ప్రజల నూతన సంవత్సర ఉగాది పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం ఉగాది పర్వదినం కావటంతో సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. తెలుగువారికి ఉగాది కొత్త సంవత్సరం కావటంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొత్త బట్టలు ధరించి పిండి వంటకాలతో విందు భోజనాలు ఆరగించారు. తీపి, చేదు కలయికతో కూడిన షడ్రుచుల కలయికతో ఉగాది పచ్చళ్లను ఆరగించారు. రైతులు వేకువజామున తమ పంట పొలాలకు వెళ్లి నాగళ్లతో పొలం దున్ని పశువుల కాడికి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వరుణ దేవున్ని వేడుకున్నారు. సాయంత్రం పట్టణంలోని భీమరాయుడి దేవాలయంలో పురోహితులు చాణిక్య ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు.



మానవపాడు: చెన్నిపాడులో పంచాంగ శ్రవణంలో గ్రామస్థులు



ఇటిక్యాల: పొలంలో పూజలు చేసి దున్నుతున్న ఇటిక్యాల రైతు



అలంపూర్: జోగుళాంబ అమ్మవారి ఆలయంలో దర్శనానికి బారులుదీరిన భక్తులు



మల్దకల్ ఆలయంలో గద్వాల సీఐకి మెమెంటో ఇస్తున్న ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాదరావు

తిమ్మప్ప స్వామికి ప్రత్యేక పూజలు

మల్దకల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మల్దకల్‌లోని స్వయంభువు లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు, పూజలు చేశారు. గద్వాల పట్టణ సీఐ టంగుటూరి శ్రీను, గట్టు ఎస్ఐ మల్లేశ్ కుటుంబ సమేతంగా తిమ్మప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదన్ ఆచార్యులు, రమేష్‌జోషి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మల్దకల్‌లోని దశమి కట్ట వద్ద అర్చకుడు రమేష్‌జోషి గ్రామస్థులు, ప్రజలకు పంచాంగాన్ని చదివి వినిపించారు.

● అలంపూరు : దక్షిణకాశీ అలంపూరు క్షేత్రంలోని బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామాల్లో అర్చకులు పంచాంగ పఠనం చేశారు.



మల్దకల్‌లో దశమికట్ట వద్ద పంచాంగాన్ని వినిపిస్తున్న అర్చకుడు రమేశ్ జోషి

నిరుపయోగంగా వ్యవసాయ పరికరాలు



నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్



మూలనపడిన విత్తన యంత్రం

- కదలని ట్రాక్టర్
- పలుమార్లు రైతులు అడిగినా పట్టించుకోని అధికారులు
- వ్యవసాయ శాఖ అధికారుల నిర్యక్షమే కారణం అంటున్న రైతులు

ధరూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం వివిధ పథకాలను అమలు చేస్తున్నా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటి ఫలాలు రైతులకు అందడం లేదు. లక్షలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్‌ను కొనుగోలు చేసినా అవి రైతులకు అందకపోగా నిరుపయోగంగా మారి తుప్పుపట్టిపోయాయి. ఇదంతా ఉన్నతాధికారుల ఉదాసీన, నిర్లక్ష్య వైఖరే కారణమేనంటూ రైతులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మండల పరిధిలోని సహాయ సహకార సంఘం బ్యాంకు ద్వారా 2008లో అప్పటి ప్రభుత్వం ఒక ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ పరికరాలను రూ.8లక్షలతో కొనుగోలు చేసింది. వీటిని అందించేందుకు ఒక ప్రకటన విడుదల చేసి అర్హులైన రైతులకు సబ్సిడీ ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ పరికరాలు అందించాలన్న ఉద్దేశంతో వీటిని సిద్ధం చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ పరికరాలను అర్హులైన రైతులకు పంపిణీ చేయపకోవడంతో తప్పు పట్టిపోయాయి. కాగా, వీటికి సంబంధించి రైతులు సబ్సిడీ ట్రాక్టర్లు అందించాలని పలువురు దరఖాస్తు చేసుకున్నా సంబంధిత అధికారుల నుంచి స్పందన కరువైంది. ప్రస్తుతం 16ఏళ్లు కావస్తున్నా వాటి ఊసే లేకపోవడంతో వ్యవసాయ పరికరాలు తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

ఈ విషయంపై రైతులు సంబంధిత అధికారులను పలుమార్లు అడిగినా తమ కు పైనుంచి ఆదేశాలు అందలేదని, అందిన వెంటనే పంపిణీ చేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కొన్నేళ్లుగా వ్యవసాయ పరికరాలు తుప్పుపట్టిపోవడంతో ప్రభుత్వం నుంచి అందిన పరికరాలు ఉపయోగంలోని రాకపోడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి వాటిని పంపిణీ చేయాలని పలువులు రైతులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే..

వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రైతులకు నేటి వరకు సబ్సిడీ ట్రాక్టర్‌ను అందించలేక పోయామని సహాయ సహకార సిబ్బంది చెప్పుకుంటున్నారు. గతంలో కూడా వ్యవసాయ అధికారులకు ట్రాక్టర్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు ఇతర ధ్రువపత్రాలు అందించాలని పలుమార్లు కోరామని, వారు ఏమాత్రం పట్టించుకోక పోవడంతో వచ్చిన పరికరాలు నిరుపయోగంగానే ఉన్నాయని సహకార సిబ్బంది చెబుతున్నారు. రైతులు కూడా వ్యవసాయశాఖ అధికారులకు వ్యవసాయ పరికరాలతో పాటు ట్రాక్టర్‌ను అందించాలని కోరినా ఏమాత్రం పట్టించే కోకపోవడంతో రూ.8లక్షల పరికరాలు తుప్పుపట్టి పోయినట్లు రైతులు చెబుతున్నారు.

అధికారి ఆదేశిస్తే పంపిణీ చేస్తాం

వ్యవసాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తే ట్రాక్టర్‌తో పాటు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంలో కూడా పలుమార్లు ఉచిత సబ్సిడీ పరికరాలు అందించే విషయంపై ఉన్నతాధికారులకు తెలియజేశాం. ట్రాక్టర్‌కు రిజిస్ట్రేషన్ లేని కారణంగా పంపిణీ చేయలేకపోయాం. ఉన్నతాధికారుల ఆదేశాలు అందితేనే పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తాం.

- రాజు, సీఈవో, సహకార సంఘం, ధరూరు

చారిత్రక బావిని కాపాడుకుందాం

● సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు



మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

గద్వాలటౌన్, మార్చి30 (ఆంధ్రజ్యోతి): సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన కొత్తబావి కబ్జాకు గురికాకుండా కాపాడుకుందామని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కోరారు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని పురాతన బావులను అభివృద్ధి చేసి సుందరీకరించే దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామన్నారు. ఈవిషయంలో ప్రజలంతా ఒకేతాటిపై ఉండి పురాతన కట్టడాల పరిరక్షణకు తోడ్పాటునందించాలన్నారు. ఆదివారం స్థానిక కొత్తబావి సమీపంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి మోహన్‌రావు విలేకరులతో మాట్లాడారు. కొత్తబావి పూడ్చివేయకుండా నిలిపివేయాలని, బావిని పునరుద్ధరించాలని కోరుతూ తాముచేసిన విజ్ఞప్తికి స్పందించి కలెక్టర్ బావిలో పూడికను తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చినా పనులు ఒక్కరోజు మాత్రమే నామమాత్రంగా జరగడం శోచనీయమన్నారు. బావి అభివృద్ధి, పునరుద్ధరణకు సంబంధించి జరుగుతున్న పోరాటానికి ప్రజలంతా సహకరించాలన్నారు. కాగా, విలువైన పురాతన ఆస్తి అన్యాక్రాంతమవుతున్నా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే తనవంతు బాధ్యతగా చొరవ తీసుకుని బావి పునరుద్ధరణకు సిద్ధపడాలన్నారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ శంకర ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న పురాతన కట్టడాలు, బావుల పరిరక్షణకు ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కురువ పల్లయ్య, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పేరు సుభాన్, బహుజన రాజ్య సమితి జిల్లా అధ్యక్షుడు వాల్మీకి, సామాజిక ఉద్యమకారులు నాగన్న, కృష్ణ ఉన్నారు.

వైభవంగా నీలకంఠేశ్వరస్వామి ప్రభోత్సవం



నీలకంఠేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఊరేగిస్తున్న భక్తులు

రాజోలి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా రాజోలి మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటా ప్రత్యేక వంటకాలతో సుంకులమ్మ, ఎల్లమ్మ, మారెమ్మ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మండలంలోని పచ్చర్ల, మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, ముండ్లదిన్నె తదితర గ్రామాల్లో ఉగాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ పండగ వాతావరణంతో సందడి ఏర్పడింది. కొత్త రాజోలిలోని రాములవారి ఆలయంలో స్వయంసేవక్ సంఘం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అలాగే ఉగాది పండుగ పురస్కరించుకుని రాజోలిలో కొలువుదీరిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ప్రభోత్సవాన్ని కుర్ని కుల బాంధవులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి బిందెసేవా కార్యక్రమం నిర్వహించారు.

అనంతరం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి, సాయంత్రం 7గంటలకు ఉత్సవ విగ్ర హాన్ని ప్రభపై ఉంచి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో కుర్ని దైవాచార కమిటీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, సభ్యులు వంక మహేష్, బీఎం. రవి, శంకర్, కర్రె లక్ష్మన్న, దూల్ల రాముడు, కుర్ని యువసేన కమిటీ సభ్యులు, కుర్ని యువకులు, భక్తులు పాల్గొన్నారు.

మల్దకల్‌లో ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు





మల్దకల్‌లోని వాల్మీకి గుడి వద్ద రాళ్లను ఎత్తుతున్న గ్రామ యువకులు

మల్దకల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మల్దకల్ మండల కేంద్రంలోని వాల్మీకి గుడి వద్ద యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సందెరాళ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు వివిధ గ్రామాలకు చెందిన యువకులు 90, 95 కేజీల రాళ్ల ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి ఉప్పరి నరేశ్ (95 కేజీల బరువు), రూ.3వేల నగదు, రెండవ బహుమతి ఎద్దులోనిబాయి బుచ్చన్నకు రూ.2వేలు నగదు బహుమతులను వాల్మీకి సంఘం నాయకుడు పి.తిమ్మప్ప అందజేశారు. కార్యక్రమంలో యూత్ కమిటీ యూత్ నాయకులు, గ్రామస్థులు ఉన్నారు.

వ్యవసాయ పనులకు ముహూర్తాలు



కవులను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్త సంయుక్తమ్మ

గద్వాల, మార్చి 30(ఆంధ్రజ్యోతి) జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆదివారం ఉగాది పర్వదినంను ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాలలో రైతులు తమ వ్యవసాయ పనులకు ముహూర్తాలను ప్రారంభించారు. వచ్చే ఖరీఫ్ సాగు కోసం వ్యవసాయ పొలాలను సిద్ధం చేసేందుకు గడెం కట్టి దున్నారు. పట్టణాలలో ప్రజలు ఉగాదిని ఘనంగా నిర్వహించారు. కొత్తదుస్తులు ధరించి పిండి పదార్థాలను ఆరగించారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. సాయంత్రం సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. కవి సమ్మేళనంలో వారణాసి నాగేశ్వరాచారి, కిషోర్‌కుమార్, రాజేష్, గోసాయి వేణు, ఒగ్గు నాగరాజు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సంయుక్తమ్మ వారిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా పంచాంగ శ్రవణంలో భక్తుల రాశులు తెలిపి వారి రాశుల ఫలితాలు, గోచార ఫలితాలు తెలిపారు. కాగా ఉగాది పర్వదినం, తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా కాంగ్రెస్ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితను నాయకులు కబీర్‌దాస్ నర్సింహులు, భాస్కర్‌యాదవ్, గోనుపాడు శ్రీనివాస్‌గౌడ్, టీఎన్ఆర్ జగదీశ్, కోటేశ్ ఆనంద్‌గౌడ్‌తో పాటు కార్యకర్తలు పూలబోకేలతో శుభాకాంక్షలు తెలిపారు.



జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితకు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు